# బలిపశువు

(కోవి రామ మోహన శాస్త్రి)

రాంబాబు రెప్ప వాల్చకుండా, ఎదురుగా కూర్చుని విలాసంగా సిగరెట్టు కాలుస్తున్న కామరాజునే చూస్తున్నాడు. కొన్ని క్షణాలు ఆ ఎయిర్‌కండిషన్డ్ రూంలో, ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

"ఏవిట్రా తంబీ ! అలా చూస్తున్నావ్?" అన్నాడు కామరాజు సిగరెట్ నుసిని యాష్‌ట్రేలో రాలుస్తూ.

"కలా, నిజమా అని !" అన్నాడు రాంబాబు.

కామరాజు పేము కుర్చీలోంచి లేచాడు. కిటికీ దగ్గరికి నడిచాడు. కర్టెన్ తొలగించి, గ్లాస్‌లోంచి బయటికి చూడసాగాడు.

ఈలోగా రాంబాబు తనూ ఓ సిగరెట్టు ముట్టించుకున్నాడు. గట్టిగా రెండు దమ్ము ల్లాగి గాలిలోకి వదిలాడు.

"ఒక్కొక్కప్పుడు కొన్ని నిజాలు కలల్లాగే ఉంటాయి బ్రదర్ ! నమ్మశక్యం కావు. ఇప్పు డిదీ అంతే ! అక్షరాలా నిజం. ఇన్నేళ్ళ తరవాత నే నొచ్చింది నీకోసమే. ఇన్ని సంవత్సరాలూ ఎందుకు ఆగాల్సొచ్చిందని అడుగుతావా? దానికి ఒకటే సమాధానం, ముందు నన్ను నేను నిలబెట్టుకోవాలి. అప్పుడు కావలసిన వాళ్ళ సంగతి, ఫీల్డులో నా స్థానం ఇప్పుడు పదిలంగా కనిపిస్తోంది. కాబట్టి నా స్నేహితుడివి నిన్ను లాక్కెడుతున్నాను !" అన్నాడు కామరాజు.

"నే నక్కడ పరిస్థితులకి ఇమిడిపోవడం కష్టమేమోరా ! మొదట్నుంచీ నే నో పద్ధతికి అలవాటు పడి ఉన్నాను !" అన్నాడు రాంబాబు.

"పరిస్థితులను బట్టి పద్ధతులు మారడం సహజంరా రాంబాబూ ! అయినా నీకేంరా? నీ సాహిత్య పునాదులు గట్టివి. రచయితగా నీ కో పేరంటూ ఉండనే ఉంది. నువ్వు నిలబడలేవన్న అపనమ్మకం నాకేం లేదు" అన్నాడు కామరాజు.

రాంబాబు సన్నగా నవ్వాడు. "ను వ్వే విషయం ఈపాటికి గమనించే ఉంటావు" అన్నాడు నెమ్మదిగా.

"అయిదేళ్ళుగా నువ్వు నాటక రచన మానేశావ్. అదేనా?" అడిగాడు కామరాజు.

"అవును. ను వ్వక్కడ చిత్రసీమలో నీ స్థానాన్ని స్థిరం చేసుకునే పట్టుదలతో పడున్నావ్. పైపైకి పాకిపోయేవ్. కాని నే నలా కాదు. నాటక రచన మానెయ్యటాని కో రెండేళ్ళ ముందు నుంచి చాలా చిత్రమైన అనుభవాలు ఎదుర్కొన్నాను. ఓ కార్మికుడి నీతి నిజాయితీలను నిరూపిస్తూ నాటిక రాసినప్పుడు నన్ను ఆకాశానికి ఎత్తేసి భుజా నేసుకున్న ఓ వర్గం జనాభా, ఓ కార్మిక నాయకుడి ద్రోహాన్ని బయటపెడుతూ నాటకం రాస్తే అభివృద్ధి నిరోధకుడని తూర్పారబట్టారు. నే నందులో చెప్పింది కార్మికు లందరి శ్రేయస్సుకోసం ఏర్పడ్డ సంఘాల్లో రాజకీయాల ప్రమేయం కూడదని, కార్మికుల శ్రేయస్సుతో పాటు ఫాక్టరీ శ్రేయస్సును కూడా నాయకులు ఆలోచించాలనీ చెప్పాను. అదీ నా పొరపా టన్నారు. నేను నమ్మిన సత్యం చెప్పాను. తప్పా? వాళ్ళ తృప్తికోసం నా అభిప్రాయం మార్చుకోదలుచుకోలేదు. నేను రచయితనే గాని, పాంప్లేట్లు రాసేవాణ్ణి కాదున్నగా !" అన్నాడు, రాంబాబు కించిత్తు ఆవేశంగా.

"చూడొరే రాంబాబూ ! సత్యాలూ, చట్టుబండలూ పత్రికల్లో అచ్చేసుకోడానికీ, ఉపన్యాసా లివ్వడానికీ బావుంటాయి. నాటక రచయితగా, నాలుగు సమాజాల్ని వెంట తిప్పుకోవాలన్నా నాలుగు రాళ్ళు గడించాలన్నా నటులూ, దర్శకులూ కోరినట్లు నాలుగు కప్పులు తెచ్చిపెట్టేలా రాయాలి" అన్నాడు కామరాజు.

"వద్దురా కాముడూ ! మళ్ళీ న న్నా రొంపిలోకి దింపాలని ప్రయత్నించకు. సొంత గొంతు పోగొట్టుకుని పైపైకి పోవాలన్న వెంపర్లాట నాకే లేదు. అయిదేళ్ళుగా ప్రశాంతంగా బతుకుతున్నాను. బుద్ధి పుట్టినప్పుడు కథ వ్రాసుకుంటున్నాను. లేదా నాకు నచ్చిన పుస్తకాలు చదువుకుని ఆనందిస్తున్నాను" అన్నాడు రాంబాబు దృఢంగా.

కామరాజు కొద్దిసేపు రాంబాబునే చూస్తూండిపోయాడు.

"రాంబాబూ ! నే నిన్నేళ్ళ తరువాత హఠాత్తుగా నీ దగ్గరి కెందుకొచ్చానో ఊహించావా?" అన్నాడు మెల్లగా.

"చూసిపోదామని" అన్నాడు రాంబాబు నవ్వి.

"అది సగం నిజం మాత్రమేరా. కేవలం అందుకోసమే అయితే నిన్ననే వచ్చిన పని పూర్తి చేసుకుని వెళ్ళిపోయేవాణ్ణి. కాని నిన్నట్నుంచి నిన్ను కన్విన్స్ చెయ్యడానికి ఉండేవాణ్ణి కాదు. పదిహేనేళ్ళనాడు నీ నాటకాలతోనే నాకు దేశంలో నటుడుగా, దర్శకుడుగా అపూర్వమైన గుర్తింపొచ్చింది. ఆ ఇమేజే ఇవ్వాళ నన్ను చిత్రరంగంలో నిలబెట్టి ఉంచింది. కాని దానివల్ల నాకు తృప్తి లేదురా. న న్నీ స్థితికి తెచ్చిన నాటక రంగాన్ని వదిలేసిన అసంతృప్తి నన్నూ, నా అభిమానుల్నీ చాలా బాధపెడుతోంది తంబీ ! నోరు విడిచి అడుగుతున్నాను. నా కో మంచి నాటకం రాసివ్వు" అన్నాడు కామరాజు దాదాపు బతిమాలుతూ.

"సారీ బ్రదర్ ! దిసీజ్ రాంగ్ నంబర్."


"అలా ఎందు కంటున్నావో నాకు తెలుసు. ఇన్నేళ్ళ తరవాత మళ్ళీ నాటకం రాయగలనా అనే సందేహం నీకుంది. కాని అది నిరాధారం. సృజనకి ఇంకిపోవడం ఉండదురా. ఇలాంటి అనుమానాలతో, పనికిమాలిన నమ్మకాలతో బలవంతాన నిన్ను నువ్వు చీకట్లోకి నెట్టుకుని బతకడం తెలివితక్కు వంటాను. టాలెంట్‌ని సరైన టైములో ఉపయోగించుకోకపోవడం మూలానే ను వ్వింకా మూలన పడున్నా వంటున్నాను. నే నింత చెపుతున్నది కేవలం నా కోసమే కాదు, నీ కోసం. నా స్నేహితుడిగా నువ్వు పైకి రావాలి. అందుకు సహకరించడం నా ధర్మం."

"అదంత నిజమేరా. కాని..."

"రాంబాబూ ! రచయితకి నిరాశా, నిస్పృహా పనికిరావురా. నీ చుట్టూ గీసుకున్న గిరిలోంచి బయటపడు. మళ్ళీ కలం పట్టు. నే నీ సాయంత్రం గోదావరికి హైదరాబాద్ వెళుతున్నాను. అక్క డో వారం రోజులు షూటింగుంది. పూర్తి చేసుకుని సరాసరి ఇటే వచ్చేస్తాను. ఈలోగా సబ్జెక్టు ఆలోచించు. ఇద్దరం కూచుని డిస్కస్ చేద్దాం" అన్నాడు కామరాజు.

రాంబాబు మౌనం వహించాడు.

** ** **



రాంబాబు - కామరాజుకీ, తనకీ జరిగిన సంభాషణని పూస గుచ్చినట్లు చెపుతుంటే, తన చెవుల్ని తానే నమ్మలేనట్లు, ఏదో ఊహాతీతమైన సంఘటన జరిగిపోతున్నట్లూ ఫీలయిపోయింది కమల. ఆమె కళ్ళు మిల మిల. మెరిసిపోతున్నాయ్.

ఆమె ఆనందానికి కారణ మేమిటో రాంబాబుకి తెలుసు. సామర్థ్యం ఉండీ నాలుగు రాళ్ళు గడించడం చాతగాక దద్దమ్మలా, వేసిన చోటే ఉండిపోయే గొంగళిలా పడున్న తనని వెతుక్కుంటూ కామరాజు రూపంలో ఓ అపూర్వమైన అవకాశం వచ్చినందుకు ఊహల్లో తేలిపోతోందని అర్థం చేసుకున్నాడు.

"కమలా ! కాస్త ఈ లోకంలోకి రా !" అన్నాడు.


"ఇంతకీ మీ రేమన్నారు?" అడిగింది కమల ఆదుర్దాగా.

"పదిహేనేళ్ళుగా నాతో జీవితం పంచుకుంటున్నావ్. నే నేమంటానో నీకు తోచనేలేదా?" అన్నాడు రాంబాబు.

"నాకు తోచినట్టే మీరని ఉంటే ఈ జన్మకి మీ రిక మారరు గాక మారరు. ఎప్పటికీ మన బతుకు లింతే. గొర్రెకి బెత్తెడు తోక లాంటి మీ జీతం, గాలి చొరని ఇరుకు గదుల కాపరం, సినిమా హాల్లో బెంచీ టిక్కెట్టు ఎంటర్టెయిన్‌మెంట్లూ, బీచ్‌లో పావలా ఖరీదు వేరుసెనగపప్పుల తిండీ, మున్సిపల్ స్కూల్లో పిల్లల ఉల్పా చదువులూ, ఇంతేనా, ఇంతకన్న గొప్ప జీవితం ఇవ్వగలరా?" అంటూ టైఫూన్‌లా దడ దడ లాడించేసింది కమల.

ఈ దారుణ సమర శంఖారావాల మధ్య తన ఆర్తారావాలు అరణ్యరోదనలని రాంబాబుకి తెలుసు. అందుకే మౌనంగా చూస్తున్నాడు. తనవంటి చిరుద్యోగిని కట్టుకున్న మధ్య తరగతి ఇంటి ఆడబడుచుకి వివాహానంతరం లభించే సౌభాగ్యాల గుర్చిన స్వప్నాలు ఎలా ఉంటాయో అతనికి తెలుసు. అవన్నీ కలలే అనీ, ఇకముందు కూడా కలలుగానే మిగులుతాయనీ నిర్ధారణ అయిపోతున్నప్పుడు ఆ స్త్రీ హృదయం ధోరణిలో ఆలోచిస్తున్నా అతని గుండె గూడు పట్లు ఎక్కడో కదిలిపోతున్నాయి. ఏదో అవ్యక్తమైన వేదన. కమల ఇన్నేళ్ళుగా ఈ అసంతృప్తితోనే తనతో జీవితం పంచుకుంటున్నదని తెలీగానే అతని మనసంత శూన్యమైపోయింది.

"మిమ్మల్ని దోపిడీలు చెయ్య మనడంలేదు. దొంగనోట్లు అచ్చేయ మనడంలేదు. దిక్కుమాలిన నమ్మకాలు వదిలేసి నలుగురూ మెచ్చేలాగా, నచ్చుకునేలాగా రాయమంటున్నాను. ఆత్మగౌరవం, సొంత గొంతూ, నా శ్రాద్ధాలూ వదిలేసి చేతి కందిన అవకాశాలు ఉపయోగించుకుని బాగుపడ మంటున్నాను. కామరాజుగారు ఇన్నేళ్ళ తరవాత ఇక్కడి కొచ్చి మీతో చెప్పిన మాట నేను ఏనాటినుంచో చెపుతున్నాను. పోనీ నేను మీ పెళ్ళాన్ని. గతిలేక మీ పంచన పడున్నాను, కట్టుకున్న కర్మానికి. ఆయన' కేం కర్మ? మీరు బాగుపడాలని పని గట్టుకొచ్చి మరీ చెప్పాడు. అవ్వ ననటానికి మీకు




నోర్రాలేదు. దరిద్ర దేవత నెత్తిమీద నిలబడి తొక్కుతుంటే నోరూ రాదు, మెదడూ పని చెయ్యదు" అంటూ వీరావేశంతో కమల కదంతొక్కుతూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

'వాస్తవం ఊహలంత అందంగా ఉండదు కమలా !' అని చెప్పా లనుకున్న రాంబాబు మాటలు గొంతులోనే ఆగిపోయేయి.

కొన్ని క్షణాలు గడిచాక రాంబాబు ఓ దృఢనిశ్చయానికి వచ్చేశాడు. పాపం, తన భార్య కమల ప్రతిసారీ ఓడిపోతూనే ఉంది. ఈమారు ఎలాగైనా ఆమెనే గెలిపించాలి. అది తన ధర్మం !


ఓ సిగరెట్టు ముట్టించాడు. గట్టిగా రెండు దమ్ములాగి గాలిలోకి వదిలాడు.

** ** **

వారం రోజులకల్లా సరిగ్గా చెప్పినట్లు తిరిగి వచ్చాడు కామరాజు. అదే హొటల్లో దిగాడు. ఓ పూట ప్రత్యేకంగా రాంబాబు దంపతుల ఆతిథ్యాన్ని స్వీకరించాడు.

"మీరు రావడం నిజంగా మా అదృష్టం అన్నయ్యగారూ. ఇంత కాలానికి మీ స్నేహితుడు మారడం మీ చలవే" అన్నది కమల.

"నా దేముం దమ్మా? నేను నిమిత్తమాత్రుడిని. సహజంగా రాంబాబు గొప్ప రచయిత. కాని ఇన్నేళ్ళూ గ్రహణంలో కప్పబడిపోయి ఉన్నాడు. బయటి కొస్తున్నాడు. ఇది వాడికి నామీదున్న



అభిమానం. అంతే'' అన్నాడు కామరాజు.

కమల వైపు చూసిన రాంబాబుకి ఆమెలో ఆనందార్ణవం పొంగిపోతున్న ట్లనిపించింది.

''అమ్మా కమలా ! ఓ వారం పది రోజులు మీ ఆయన్ని నేను బందిఖానాలో ఉంచేస్తాను. నీకేం అభ్యంతరం ఉండదు కదా?'' అన్నాడు కామరాజు.

''అదేం మా టన్నయ్యా: మంచి రచన తయారవాలంటే ఎంత శ్రమ పడాల్సుంటుందో నే నెరగనంటారా?'' అన్నది కమల.

''ఇన్నేళ్ళు గడిచాక రాంబాబుని మంచి రచన కోసం మళ్ళీ శ్రమ పెడుతున్న ఘనత నాదేనమ్మా ! ఏరా తంబీ ! మాట్లాడవేం?'' అడిగాడు కామరాజు.

''మీ ఆనందాన్ని మౌనంగా పంచుకోడంలో నాకు ఆనందం దొరుకుతోందిరా'' అన్నాడు రాంబాబు !


నవ్వింది కమల. శ్రుతి కలిపాడు కామరాజు.

రాత్రే కామరాజూ, రాంబాబూ కథమీద కూచున్నారు. అందుకోసం కామరాజు చాలా ఏర్పాట్లు చేశాడు. కాని అలాటి ఖరీదైన అలవాట్లు లేని రాంబాబు పాలుపంచుకోలేకపోయాడు. కామరాజుకి అది గొంతులోకి దిగకపోతే ఏకాగ్రత కుదరకపోవడం బలహీనత.

ఆ రాత్రే కాదు, మరో రెండు రాత్రులు కూర్చుంటే గాని, కథ ఓ రూపానికి రాలేదు. సినాప్సిస్ రాశాక కామరాజు మహదానంద పడిపోయాడు.

''తంబీ ! రియల్లీ యువార్ గ్రేట్. ఇందులో జీవితం ఉంది. ఎంటర్టైయిన్‌మెం టుంది. సమస్య లున్నాయి. చక్కటి పరిష్కారా లున్నాయి. సజీవమైన పాత్ర లున్నాయి. అద్భుతంరా రాంబాబూ ! వ్యథార్త జీవుల యథార్థ జీవిత చిత్రణ'' అన్నాడు కామరాజు ఆవేశంతో.

నాలుగో రోజు కామరాజుకి మద్రాసు నుంచి ట్రంకా లొచ్చింది. రిసీవర్ దించుతూ - ''రాంబాబూ ! అయామ్ వెరీ సారీ ! నే నర్జెంటుగా మద్రాసు వెళ్ళిపోవాలి. చాలాకాలంగా హీరో కాల్‌షీట్లు దొరక్క ఆపేసిన పిక్చర్ పది రోజుల్లో ఫినిష్ చెయ్యాలి. ప్రొడ్యూసర్ గోల పెట్టేస్తున్నాడు. ఈ వారం రోజులూ నే నిక్క డుండిపోతే... మళ్ళీ ఆ హీరోగారికి ఖాళీ ఉండదు. ఓ పని చెయ్యి. ఈ రూం పది రోజులు నీకిందే ఉంచేస్తాను. ఇక్కడే ఉండి పూర్తి చెయ్యి ! ఎమౌంట్ పే చేసి వెళతాను ఓకే?'' అన్నాడు.




''వద్దురా కాముడూ. ఈ హొటల్ రూంలూ, ఈ వైభోగాలూ నా ఒంటికి పడవు. నా అద్దె కొంపలో నా ఇరుకు గదీ, కాళ్ళూగే టేబులూ, పాత కాలంనాటి చేతుల కుర్చీ, నా పెళ్ళినాడు ఓ పేద మిత్రుడు ప్రెజెంట్ చేసిన పాత మోడల్ టేబుల్ లైటూ, మా ఆవిడ అలకలూ, విసుక్కోడాలూ... నా కిష్టం. కొత్తచోట నా కలం నడవదు. అది నా వీక్నెస్'' అన్నాడు రాంబాబు.

కామరాజు నవ్వేసి - ''నీ ఇష్టం ! కాని పది రోజుల్లోగా స్క్రిప్ట్ నా కందాలి. బద్ధకించవు కదా?'' అన్నాడు.

''లేదు బ్రదర్. ఈలోగానే పంపిస్తాను'' అన్నాడు రాంబాబు.

నిజంగానే రాంబాబు బద్ధకించకుండా సరిగ్గా పదోనాటికి నాటకం ప్రతిని రిజిస్టర్డ్ పోస్టులో కామరాజుకి పంపించాడు.

''డియర్ తంబీ ! వాగ్దానం నిలబెట్టుకున్నావ్. కృతజ్ఞతలు. పెద్ద బాధ్యత మీద వడేసుకున్నాను. ప్రతి క్షణం అమూల్యమైనదే. వెరీ బిజీ. కాస్టింగ్ పూర్తి చేస్తున్నాను. త్వరలో మరో లెటర్ రాస్తాను. ప్రస్తుతానికి సెలవ్.

నీ,
కామరాజు.''

పదిహేను రోజుల తరవాత అందుకున్న ఆ ఉత్తరం చదివి రాంబాబూ, కమల చాలా తృప్తి పడిపోయారు.

''మా కాముడు నిజంగా చాలా పట్టుదల ఉన్న మనిషి కమలా !'' అన్నాడు రాంబాబు.

''నా కెప్పుడో తెలుసండీ ఆ సంగతి. ఈ పని ఇదివరకే చేసుంటే మీ పేరు ఈపాటికే చిత్రరంగంలో మారుమోగి ఉండేది. పోన్లెండి. ఇప్పటికైనా నా మాట విన్నారు. అదే పదివేలు'' అన్నది కమల, మనోహరంగా నవ్వుతూ.

తృప్తిగా నవ్వుకున్నాడు రాంబాబు. అందుకు కారణం ఇంత కాలానికి ఆమె మనస్ఫూర్తిగా సంతోషించగలిగే పని చెయ్యగలిగినందుకు.

** ** **

ఆవేళ దురదృష్టం కొద్దీ మెయిల్ పన్నెండు గంటలు ఆలస్యంగా మద్రాసు సెంట్రల్ చేరింది. చేరేసరికి సాయంత్రం సరిగ్గా అయిదు గంటలయింది. ఆరు గంటలకి కళామందిరంలో నాటకం ప్రారంభమవుతుంది.

రాంబాబు ట్రెయిన్ దిగి కర్తవ్యాన్ని గురించి ఆలోచిస్తూ రెండు నిముషాలు ప్లాట్‌ఫారం మీదే నిలబడ్డాడు. ఇప్పుడు తాను సరాసరి కామరాజు ఇంటికి వెళ్ళినా అత నీపాటికి ఆడిటోరియంకి వెళ్ళిపోయి ఉంటాడు. కనక త నక్కడికి వెళ్ళి ప్రయోజనం ఉండదు.

ఆలోచనలతో టైం వేస్ట్ చెయ్యటం కన్నా దగ్గర్లో ఉన్న ఏదన్నా హొటల్లో రూం తీసుకుని స్నానం, గట్రా కానిచ్చి, ఇంత కాఫీ తాగి, థియేటర్‌కి వెళ్ళడం మంచి దనుకున్నాడు రాంబాబు. అనుకున్నట్లే పావుగంటలో దగ్గర్లో ఉన్న హొటల్ రూంలో చేరాడు. స్నానం చేసి డ్రెస్ చేసుకున్నాడు. వేడి వేడి కాఫీ తాగి రూంకి తాళం బిగించి రోడ్డుమీది కొచ్చాడు. ఆటో ఎక్కి కూర్చున్నాడు. ఎంత కంగారుగా బయలుదేరినా, రాంబాబు థియేటర్ చేరేసరికి నాటకం మొదలైపోయింది. కామరాజుకి కబురు చెయ్యడం ఇష్టంలేక డొనేషన్ పాస్ తీసుకుని లోపలికి వెళ్ళి సీట్లో కూర్చున్నాడు. జనం కిట కిట లాడుతున్నారు లోపల.

రాంబాబు హృదయం ఉద్వేగంతో నిండి ఉంది. చాలా సంవత్సరాల తరవాత తన నాటకాన్ని రంగస్థలం మీద చూసుకుంటున్నందుకు అవ్యక్తమైన ఆనందానుభూతి అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

తృప్తిగా నిట్టూర్చి ప్రదర్శన చూడ్డంలో లీనమైపోయాడు రాంబాబు. రెండున్నర గంట లెలా గడిచాయో అతనికే తెలీదు. ఆడిటోరియం దద్దరిల్లిపోతున్న కరతాళధ్వనులతో అత నీలోకంలో కొచ్చిపడ్డాడు.

అతని కళ్ళలో ఆనందబాష్పాలు.

''డియర్ కావ్రుడూ ! నీ టాలెంట్‌కీ, నీ కృషికీ నా జోహార్లురా. ను వ్వింత క్రియేటివ్ జీనియస్‌నని గ్రహించలేని నా ఇన్నాళ్ళ అజ్ఞానాన్ని మన్నించు. నేను రచయితగా మళ్ళీ తలెత్తుకు తిరిగే అవకాశం కలిగించావు. నీ ఋణం తీర్చుకోలేను'' అంటూ అతని హృదయం మిత్రుడికి మౌన కృతజ్ఞతలు చెప్తోంది.

పాత్రల పరిచయం జరుగుతోంది.

ఆఖరి పరిచయంగా 'అత్యంత ముఖ్య పరిచయం' అన్నది ఎనౌన్సర్ గొంతు.

అంత నిశ్శబ్దంగా ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

''ఈ కళాఖండాన్ని సృష్టించి, పాత్రలకు ప్రాణం పోసి, మీ ముందుంచి, ఆ ప్రాణులకు ముఖ్యప్రాణి అయి మీ ముందు నిలచి, మిమ్మల్ని వినూత్న లోకాల్లో విహరింపజేసిన రచయిత, దర్శకుడు శ్రీ కామరాజు...''

చప్పట్లతో పరిసరాలు ఘూర్ణిల్లేయి.

రాంబాబు నవనాడులూ కుంగిపోయినై. నిస్సత్తువ నిలువెల్లా ఆవహించి కుర్చీకి అంటిపెట్టుకుపోయాడు.

వివిధ నాటక సమాజాలు కామరాజుని పూలమాలలతో సత్కరించి అభిమానాన్ని

వ్యక్తపరచడం రాంబాబు నీటి పొరల కళ్ళు మసగ్గా చూడగలుగుతున్నాయి.

కొద్దిసేపటి తరవాత హాల్లో నిశ్శబ్దం.

"రసజ్ఞులకు అభివాదం. ఎన్నో ఏళ్ళుగా మళ్ళీ నాటకం రాయాలనీ, న న్నీ సినిమా రంగానికి చేర్చిన నాటక కళామతల్లికి చిరుకానుకగా ఓ ప్రదర్శన సమర్పించుకోవాలనీ ఆశిస్తూ వచ్చాను. మూడున్నర నెల కిందట ఓ పిక్చర్ మీటింగ్ కోసం హైదరాబాద్ వెళ్ళాను. అక్కణ్ణుంచి నా బాల్యమిత్రుడు రాంబాబుని చూద్దామని వైజాగ్ వెళ్ళడం జరిగింది. అతనితో నా సమావేశమే ఈ నాటక రచనకి నాంది. అతనికి నేనంటే వల్లమాలిన అభిమానం. పాత జ్ఞాపకాలన్నీ నెమరువేసుకుంటున్న సందర్భంలో పదేళ్ళ నా డెప్పుడో నేను చెప్పిన కథ గుర్తు చేసి - 'నాటకం రాయకూడదా' అన్నాడు. 'చిత్రసీమలో ఎంత బలమైన స్థానం ఉన్నా ని న్నింతవాణ్ణి చేసిన నాటక రంగాన్ని నిర్లక్ష్యం చెయ్యడం న్యాయం కా'దన్నాడు. అతని ఆవేదన నా కర్థమైంది. టైము లేదన్న నా వాదాన్ని కొట్టిపారేశాడు. నన్ను బలవంతాన మూడు రోజు లుంచేశాడు. నేను డిక్టేట్ చేస్తుంటే తను రాసిపెట్టాడు. ఈ రచన ఆవిధంగా మీ ముందుకి రాగలిగింది. మిమ్మల్ని మెప్పించింది. అది నా అదృష్టం. రాంబాబుని ఆహ్వానించాను. డబ్బు పంపించాను. కాని ఏ కారణంచేతనో రాలేకపోయాడు. ఈ సభాముఖాన అతనికి నా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. సెలవు" అంటూ తన ఉపన్యాసం ముగించాడు కామరాజు.

'అబద్ధం, మోసం, దగా' అని గొంతు చించుకుని అరవా లనిపించింది రాంబాబుకి. కాని ఆ పని చెయ్యలేని అశక్తత అతనికి అడ్డుపడింది. అరిచి ప్రయోజనం లేదు. కామరాజు ఫీల్డులో ప్రముఖ వ్యక్తి. ఇంత జరిగాక ఆ నాటక రచయిత అతడు కాదనీ, తనే అని నిరూపించడం సాధ్యం కాదనీ గ్రహించే మౌనం వహించాడు.

జనం ఆడిటోరియంలోంచి కదులుతున్నారు. రాంబాబు గబగబా బయటికి నడిచాడు. ఓ చిన్న కాగితంమీద 'హొటల్ ఎవరెస్ట్, రూం నంబర్ 18, రాంబాబు' అని రాసి ఓ కార్యకర్త చేతి కిచ్చి "దయచేసి కామరాజుగారి కివ్వండి" అనేసి ఆవరణలోంచి బయటపడ్డాడు. పోతున్న ఆటో ఆపి కూర్చున్నాడు.

రాత్రి పదకొండైంది.

రాంబాబు సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ రూంలో ఒంటరిగా కూర్చుని ఉన్నాడు.

తలుపు చప్పుడైంది.

"కమిన్ !" అన్నాడు రాంబాబు.


కామరాజు లోపలి కొచ్చాడు. రాగానే కళ్ళార్పకుండా రాంబాబునే చూస్తూ నిలబడిపోయాడు గుమ్మం దగ్గరే.

"కంగ్రాచ్యులేషన్స్‌రా కాముడూ !" అన్నాడు రాంబాబు.

అప్పటిదాకా నిజజీవితంలో అవసరం, అవకాశం రెండూ లేని తను మొట్టమొదటిసారి నటించగలుగుతున్నందుకు తనని తనే అభినందించుకుంటున్నాడు రాంబాబు లోలోపల.

కామరాజు చిన్న మొహం చేసుకుని మిత్రుడి రెండు చేతులూ పట్టుకుని - "నన్ను క్షమించరా రాంబాబూ !" అన్నాడు.

"ఇందులో క్షమించడానికేం లేదురా. నీ రంగంలో ఇవి చాలా సాధారణమైన సన్నివేశాలు. నే నెరగనివి కావు. అయినా మనం స్నేహితులం. మన మధ్య తేడా లుండకూడదు. జరిగింది ఏదైతేనేం? నువ్వు నాటక రచయితగా ఎస్టాబ్లిష్ కాగలిగావ్. ఈమధ్య కొద్దిగా షేకీగా ఉన్న నీ స్థానం ఇప్పుడు బాగా బలపడింది. అవునా? దెన్. నా క్కావలసింది కూడా అదే. అస లిదంతా జరగవల్సింది కాదు. నీ పరిస్థితి గురించి ఓ మాట ముందుగా చెప్పుంటే... ఆనందంగా నీకు ఘోస్ట్ రైటర్‌ని అయ్యేవాణ్ణి. అందులో నాకు చాలా తృప్తి దొరికి ఉండేది. దానికి బదులు మన బంధం ఓ వ్యాపార సంబంధంగా మారినందుకు బాధపడుతున్నాను. లీవిట్. ఇప్పుడు అసలు




విషయాని కొస్తున్నాను. రచయితగా నేను సంవత్సరాలుగా శ్రమించి సంపాదించుకున్న నా పేరుని నీకు ఎరువు ఇచ్చినందుకు నాకు ఎం తివ్వదల్చుకున్నావ్?" అని సూటిగా ప్రశ్నించాడు రాంబాబు.

కామరాజు క్షణకాలం మౌనం వహించాడు.

"బాధపడకు ! ఈ ప్రశ్న అడిగిన గొంతు నాది. దీని వెనక ఎవ రున్నారో నీకు తెలుసు. ఆ వ్యక్తికి నేను జవాబు చెప్పుకోవాలి కదా !" అన్నాడు రాంబాబు మళ్ళీ తనే.

కామరాజు జేబులోంచి ఓ యాభై రూపాయల నోట్ల కట్ట తీసి రాంబాబు చేతుల్లో ఉంచాడు.

"రాంబాబూ ! ఇది నీ పేరుకీ, రచనకీ కట్టిన విలువ కాదురా ! నా పాపానికి పరిహారం. అంతే. నేను చాలా పతనమైన మనిషిని - కేవలం ప్రలోభంవల్ల. నువ్వు ఎదిగిన వ్యక్తివి. నీతో నన్ను పోల్చకు బ్రదర్. నువ్వు నన్ను క్షమించలేవని నాకు తెలుసు. అడిగే అర్హత లేదని ఎరిగి కూడా అడగ్గలిగేనంటే అది నా అలవాటుగా భావించు. ఇన్నేళ్ళు నే నిలాంటి మెట్లమీదే కాళ్ళు వేసి పై కెక్కుతున్నాను. ఈ మెట్లు నన్ను ఉన్నత శిఖరాలకు చేరుస్తాయో, మధ్యలోనే విరిగిపోయి, పాతాళానికి పడదోస్తాయో కాలమే నిర్ణయిస్తుంది. నాకు సెలవియ్యి" అన్నాడు కామరాజు.

"బెస్ట్ ఆఫ్ లక్ !" అన్నాడు రాంబాబు.

కామరాజు నెమ్మదిగా బయటికి నడిచిపోయాడు.

అప్పటిదాకా ఆపుకున్న కన్నీళ్ళు ఒక్కసారి పొంగి పొర్లిపోతున్నాయి రాంబాబు కళ్ళలోంచి. కారణం తనను స్నేహితుడు మోసగించినందుక్కాదు. అతని పతనావస్థకి జాలితో.

** ** **

రిజిస్టర్డ్ కవరు చించి లోపల్నుంచి కాగితాలు పైకి లాగి చూశాడు కామరాజు వణుకుతున్న చేతులతో-

అందులో ఒక ఉత్తరం, దానికి పిన్ చేసిన అయిదు వేల ఒక రూపాయి డ్రాఫ్ట్ ఉన్నాయి.

ఉత్తరం చదవసాగాడు కామరాజు.

"పూజ్యులైన అన్నయ్యగారికి కమల అనేక నమస్కారాలతో రాసే విశేషాలు. ఇక్కడ నేనూ, మా శ్రీవారూ, పిల్లలూ క్షేమంగా ఉన్నాం. అక్కణ్ణుంచి రాగానే ఈయనగారు నాటకం చాలా బ్రహ్మాండంగా వచ్చిందనీ, గొప్ప పేరొచ్చిందనీ చెప్పి అయిదు వేలు నా చేతి కిచ్చారు. మహదానందపడిపోయాను. తీరా మూడు రోజుల తరువాత పత్రికల్లో ఆ ప్రదర్శన గురించి వచ్చిన ప్రత్యేక వ్యాసాలు చదివాక కాని, అసలు అక్కడ జరిగిం దేమిటో తెలీలేదు. ఇన్నేళ్ళుగా నేను మనుషుల్లో నీతినీ, నిజాయితీనీ, ప్రేమాభిమానాల్ని చూస్తూ, ఒక కళంక రహితమైన వ్యక్తిత్వాన్నీ ఊహించుకుంటూ వస్తున్నాను. కాని నా పరిమిత ఆలోచనా పరిధుల్ని మించి మనుషులు చాలా 'ఎదిగి'పోయారని గ్రహించి నే నెంత వెనకబడి ఉన్నానా అని సిగ్గుపడ్డాను. మీరు నాటకం డిక్టేట్ చేస్తుంటే మీ కొక 'వ్రాయసకాడుగా' ఉద్యోగం నిర్వహించిన మా వారికి మీ రో అయిదు వేలు ప్రతిఫలంగా ఇచ్చారు కదా ! ఆపాటి చిరుసాయం చేసిన మీ చిన్ననాటి స్నేహితుడిని, ఓ ప్రముఖ రచయితని అలా కించపరచడం భావ్యంకా దనిపించింది నాకు. అంతేకాదు, ఆ డబ్బు ఆయన తనకోసం కాక నా తృప్తికోసం, నా ముందు తన సమర్థత నిరూపించుకోడానికి తీసుకోవాల్సి వచ్చిందని

అర్థమై ఆయనకు తన వ్యక్తిత్వంకన్న నా ప్రేమ ఎంత విలువైనదో గ్రహించాను.

"నాకు ఈ తుచ్ఛమైన డబ్బు కాదు ముఖ్యం, ఆయన వ్యక్తిత్వం. నా పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమానురాగాలు. అవి శాశ్వతంగా ఉంటే చాలు. అందుకే ఈ డబ్బు తిరిగి మీకు పంపిస్తూ, ఆ మొత్తానికి మా కష్టార్జితం మరొక రూపాయి కలిపి మరీ డ్రాఫ్ట్ పంపుతున్నాను. స్వీకరించండి. మీకు డబ్బు లేదని కాదు, మాకు అవసరాలు ఉండవనీ కాదు. మేము నేలబారు మనుషులం. మీరు? అందమైన మేడల్లో ఉంటూ, కారుల్లో తిరుగుతూ, ఖరీదైన హోటల్ రూముల్లో విదేశీ సీసాలు సేవిస్తూ కథల మీద కూచునే ప్రముఖులు. మాకు సెంటిమెంట్సు జీవన సహచరులైతే, మీ కా - సెంటిమెంట్సు కాష్ చేసిపెట్టే శక్తివంతమైన ఇన్‌స్ట్రుమెంట్స్. చిత్రంగా లేదూ?

"చివరగా మా వారి గురించి ఓ చిన్న మాట. ఆయన సృజన అక్షయపాత్ర. ఆయన మేధ ఓ కథల కార్ఖాగారం. అందులో, జీవితానుభవాల లోతుల్లోంచి లక్షోపలక్షల కథా వస్తువులు నిర్విరామంగా ఉత్పత్తి అవుతూనే ఉంటాయి. వాటిని దొంగతనంగా తీసుకుపోవా లనుకునే వాళ్ళంతా నా దృష్టిలో జమీందారుగారి ధాన్యపు గిడ్డంగిలోంచి గింజలు దొంగిలించుకుపోయే పిచ్చుకల్లాంటి వాళ్ళు. ఆయన సాహిత్యా పునాదులు చాలా దృఢమైనవి. ఆ పునాదులమీద నిర్మాణమయ్యే ఏ భవంతైనా టైఫూన్లకీ, హారికేన్లకీ చెక్కుచెదరకుండా శాశ్వతంగా నిలబడే ఉంటుంది.

"కాని మరి మీరు?"

"ఏమో ! మీ రెవరో, ఎలాంటి వారో మీ హృదయాన్ని మీ మేధను అడిగి చూడండి. మీ రూపాన్ని యధాతథంగా మీకు చూపించగలవేమో?

ఇట్లు
మీ సోదరి,
కమల."

కామరాజు చేతుల్లోంచి డ్రాఫ్ట్‌తో పాటు ఉత్తరం జారి కింద పడి ఫాన్ గాలికి అటూ ఇటూ ఎగురుతున్నది అతని హృదయంలాగే.

అదే సమయాన...

అక్కడ విశాఖపట్నంలో...

తన అద్దె కొంపలో, ఇరుకు గదిలో, కోళ్ళూగే టేబుల్ ముందు, పాత కాలంనాటి చేతుల కుర్చీలో కూర్చుని, తన పెళ్ళినాడు ఓ పేద మిత్రుడు ప్రెజెంట్ చేసిన పాత మోడల్ టేబుల్ లైటు వెలుగులో 'స్కేప్ గోట్' అనే కొత్త నాటకం ఏకదీక్షగా రాస్తున్నాడు రాంబాబు, సరికొత్త ఆవేశంతో. ★

